క్లుప్తంగా

క్రోసూరు స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ

క్రోసూరు: క్రోసూరు పోలీసుస్టేషన్‌ను మంగళవారం రాత్రి పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ విజిట్‌లో భాగంగా వచ్చినట్లు తెలిపారు. అచ్చంపేట మండలం నుంచి వస్తూ క్రోసూరు పోలీసుస్టేషన్‌ను ఆయన సందర్శించారు. స్టేషన్ ఎస్‌ఐ ఎం.షఫీ, పోలీసు సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. స్టేషన్ పరిధిలోని శాంతి భద్రతల పరిస్థితిని ఎస్‌ఐ ద్వారా ఎస్పీ తెలుసుకున్నారు.

పాడి రైతులకు బోనస్



క్రోసూరు: రెంటపాళ్ల సంగం డైయిరీ బీఎంసీ పరిధిలోని అందుకూరు, పీసపాడు గ్రామాల ఖాతాదారులకు మంగళవారం 2023–24 సంవత్సరానికి బోనస్ అందించామని ఆయా గ్రామాల పాల సేకరణ కేంద్రం అధ్యక్షులు ఎం. రామారావు, డి.కోటిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అందుకూరులో 115 మందికి రూ.1,75,885 అందించినట్లు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన వాసిరెడ్డి వెంకటేశ్వర్లుకు అత్యధికంగా రూ.7,448 లభించినట్లు తెలిపారు. పీసపాడులో 164 మందికి రూ.2,52,085 పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు, రెంటపాళ్ల పాల శీతలీకరణ కేంద్రం మేనేజరు గోపీకృష్ణ, రూట్ మేనేజరు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల అందజేత



రాజుపాలెం: అంగవైకల్యం కలిగిన 90 మందికి నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం కింద మండలంలోని గణపవరం సబ్ సెంటర్‌లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె. వెంకటకృష్ణ కుమార్ మంగళవారం ఉపకరణాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి అలేఖ్య, ఏఎన్ఎం విమల, ఆశా కార్యకర్తలు సంతోషం, దీవెన తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి ప్రత్యేక బస్సులు నడపాలని వినతి

అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం వేద వ్యాస మహర్షి ఆలయం వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నారు. మంగళవారం విజయవాడ బస్‌భవన్‌లో ఏపీఎస్ఆర్టీసీ అదనపు కమిషనర్ చంద్రశేఖర్‌ను, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మానంద రెడ్డిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గుంటూరు నుంచి తాడికొండ అడ్డరోడ్డు, నిడుముక్కల, 14వ మైల్, ఎండ్రాయి, చావపాడు, పెదమద్దూరుల మీదుగా వైకుంఠపురం వరకు బస్ సర్వీస్ నడపాలన్నారు. వైకుంఠపురం వేదవ్యాస సనాతన ధర్మక్షేత్రానికి ప్రతి ఆదివారం వేలాది మంది భక్తులు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వస్తారని గుర్తుచేశారు. గుంటూరు నుంచి అమరావతికి వచ్చి, అక్కడి నుంచి విజయవాడ బస్‌లో వైకుంఠపురం చేరుకుంటున్నారని తెలిపారు. గుంటూరు నుంచి విజయవాడ మీదుగా గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆర్టీసీ ఏసీ, నాన్ ఏసీ బస్సులను నడపాలని కూడా వినతి పత్రంలో కోరారు.

కట్న వేధింపులపై కేసు నమోదు

ముప్పాళ్ళ: అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నారని వివాహిత చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.హజరతయ్య మంగళవారం తెలిపారు. ముప్పాళ్ళ ఎస్సీ కాలనీకి చెందిన మాడుగుల కోటేశ్వరమ్మతో గుంటూరుకు చెందిన విజయసాగర్‌కు సుమారు ఏడు నెలల క్రితం వివాహం జరిగింది. భర్త , అత్తమామలు తరచూ అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తుండటంతో ఆమె పుట్టింటికి చేరారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హాస్యకళాకారుడు జయప్రకాష్ మృతి



వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన ప్రముఖ హాస్య కళాకారుడు కట్టెంపూడి జయప్రకాష్(71) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. వినుకొండ సీనియర్ న్యాయవాది వద్ద గుమస్తాగా చాలా కాలం పనిచేశారు. నాటికలు రచించి, దర్శకత్వం వహించారు. అభినవ దుర్యోధన అనే హాస్య ఏకపాత్రాభినయాన్ని ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి అనేక మందిని తన హాస్యచతురతతో ఆకట్టుకున్నారు.

ఒరిగిన స్తంభాలు.. వణుకుతున్న రైతన్నలు



పెదకూరపాడులోని కామినేని చెరువు వద్ద స్తంభం దుస్థితి



అబ్బరాజుపాలెం ప్రాంతంలో తక్కువ ఎత్తులో తీగలు

పెదకూరపాడు: ఖరీఫ్ సీజన్ మొదలైంది.... అన్నదాతలు ఉదయం నుంచి సాయంత్రం వరకు పంట పొలాల్లోనే ఉంటారు. నిత్యం ఏదో పని చేస్తూ అక్కడే ఉండాల్సిన పరిస్థితి. వర్షాకాలం, ఈదురుగాలుల ప్రభావంతో విద్యుత్ స్తంభాలు, తీగలతో ఎప్పుడు ఎటు నుంచి ప్రమాదం వస్తుందోనని అన్నదాతలు వణుకుతున్నారు. పొలాల్లో విద్యుత్ స్తంభాలు, తీగలు ప్రమాదకరంగా ఉండటమే దీనికి కారణం. వర్షాలకు, గాలులకు కొన్ని ఒరిగి, మరి కొన్ని దాదాపు నేలపై వాలిపోయాయి. తీగలు చేతులకు అందేస్థాయిలో దర్శనం ఇస్తున్నాయి. దీంతో రైతులు, రైతు కూలీలు భయపడుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే తగిన మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.





కాలచక్ర రోడ్డుకు ఇరువైపులా ఒరిగిన స్తంభాలు

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి

సత్తెనపల్లి: ఆధార్ సవరణల శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి కోరారు. పురపాలక సంఘం పరిధిలో టీటీడీ (రెండో) సచివాలయంలో మంగళవారం ఆధార్ సవరణల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఆధార్‌లో మార్పుచేర్పులకు మాత్రమే ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్‌కు మొబైల్ నెంబర్ అనుసంధానం చేయడంతోపాటు బయోమెట్రిక్ అప్డేట్, ఫొటో, ఐరిష్ వేలి ముద్రలు, పేరు, పుట్టిన తేదీల్లో మార్పులు, చిరునామాలో మార్పు వంటి సేవలను అందిస్తారన్నారు. పట్టణంలో ఈ నెల 24న రంగా కాలనీ (1వ సచివాలయం), 25న అచ్చంపేట రోడ్ (3వ సచివాలయం), 26న క్రిస్టియన్‌పేట(5వ సచివాలయం), 27న కంబాల బావి ఏరియా(4వ సచివాలయం) పరిధిలో శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు. ఆయా సేవలకు సంబంధించి నిర్ణీత రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. మార్పుచేర్పుల నిమిత్తం వచ్చే వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రక్రియ పూర్తి చేయాలని ఎడ్యుకేషనల్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ రెబ్బారపు సురేష్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



రెండో సచివాలయంలో ఆధార్ సవరణలపై సురేష్‌కు సూచనలు చేస్తున్న కొలిమి షమ్మి

27 వరకు ఆధార్ సవరణ శిబిరాలు

నకరికల్లు: ఆధార్ కార్డులలో మార్పుచేర్పులకు ప్రత్యేక శిబిరాలను ఈ నెల 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.జయమణి మంగళవారం తెలిపారు. నకరికల్లులోని ఉన్నత పాఠశాలలో క్యాంపు అందుబాటులో ఉంటుందన్నారు. 24వ తేదీన చేజర్ల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో, 25న గుండ్లపల్లిలోని సచివాలయం–2లో, 26న కుంకలగుంట, నర్సింగపాడు సచివాలయాల్లో, 27న కుంకలగుంట సచివాలయం–2, నర్సింగపాడు గ్రామాల్లోని సచివాలయంలో శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సర్వర్‌లో ఇబ్బందులు...

ముప్పాళ్ళ: మండలంలో మూడు గ్రామ సచివాలయాల్లో ఆధార్ సంబంధిత కేంద్రాలు ఏర్పాటు చేశారు. ముప్పాళ్ళ, నార్నెపాడు, బొల్లవరం గ్రామాల్లో ఈ ప్రక్రియ చేపట్టేందుకు సచివాలయ సిబ్బందిని ఎంపిక చేసి శిక్షణ అందించారు. మంగళవారం నుంచి 27వ తేదీ వరకు 10 రకాల సేవలు అందించేలా వీలు కల్పించారు. అయితే ప్రారంభించిన రోజే సేవలు నిలిచిపోయాయి. సర్వర్ ఇబ్బందులతో దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన వారు వెనుదిరగాల్సి వచ్చింది. ఈ విషయంపై ఎంపీడీవో శ్రీకృష్ణను వివరణ కోరగా.. సర్వర్ నిలిచిపోయిన మాట వాస్తవమేనని, సాయంత్రానికి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. సర్వర్ పునరుద్ధరించగానే ఆధార్ సవరణల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు.

రాజుపాలెం మండలంలో...

రాజుపాలెం: మండలంలోని 14 గ్రామ సచివాలయాలలో ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో రామకృష్ణప్రసాద్ మంగళవారం తెలిపారు. 24వ తేదీన మొక్కపాడు, అనుపాలెం, నెమలిపురి–2, 25వ తేదీన రెడ్డిగూడెం, అంచులవారిపాలెం, ఇనిమెట్ల, 26వ తేదీన గణపవరం–1, చౌటపాపాయపాలెం, ఉప్పలపాడు, 27వ తేదీన గణపవరం–2, చౌటపాపాయపాలెం, బలిజేపల్లి, గ్రామ సచివాలయాలలో క్యాంప్‌లు ఉంటాయని పేర్కొన్నారు.

ఎంపీయూపీ స్కూల్లో శిక్షా సప్తాహ్

శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెం గ్రామం ఎంపీయూపీ పాఠశాల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాతా మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచి విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకు కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. మాతృభాష తెలుగులో అక్షరాలు రాయటం చదవటం, గణితంపై కూడికలు, తీసివేతలు, హెచ్చ వేతలు విద్యార్థులకు అర్థం అయ్యేలా ఆటలు రూపంలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొంతా ఫణికుమారి, జె.మునెయ్య పాల్గొన్నారు.

ఎస్‌బీ పురం పాఠశాలకు బంగారు పతకాలు



నరసరావుపేట రూరల్: లింగంగుంట్ల శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పలు పోటీలలో పాల్గొని ఐదు గోల్డ్ మెడల్స్ సాధించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి మంగళవారం తెలిపారు. సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ఈనెల నిర్వహించిన ఎన్‌సీసీ క్యాంప్‌లో పాఠశాలకు చెందిన పి.లావణ్య, ఎస్‌కె ఆసిఫ్, సిహెచ్ మేరి మాతలకు షూటింగ్, రన్నింగ్‌లో గోల్డ్ మెడల్స్ సాధించినట్టు తెలిపారు. రేపల్లెలో జరిగిన క్యాంపులో పాఠశాల 10వ తరగతి విద్యార్థి ఎం.శివసాయిశేఖర్ తైక్వాండోలో, టి.జాన్‌పాల్ ట్రెక్కింగ్‌లో బంగారు పతకాలను గెల్చుకున్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని పార్వతి, పీడీలు జీ.ఝాన్సీరాణి, ఎస్‌కె.ఫాతిమా, పి.తిరుపతిరావు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

జంగాలపల్లెలో పశువులపై పిచ్చికుక్క దాడి



నాదెండ్ల: జంగాలపల్లె గ్రామంలో మంగళవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి గ్రామస్తులను భయాందోళనలకు గురి చేసింది. నాలుగు గేదెలు, ఐదు ఆవులను కరిచి గాయపరిచింది. దీంతో గ్రామస్తులు నాదెండ్ల పశువైద్యాధికారికి సమాచారమిచ్చారు. స్పందించిన డాక్టర్ ఏడుకొండలు తన సిబ్బందితో గ్రామానికి చేరుకుని కుక్కకాటుకు గురైన ఆవులు, గేదెలకు చికిత్స చేశారు. రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనతో మాట్లాడుతూ కుక్కల బెడద ఎక్కువగా ఉందని, గతంలో కూడా మనుషులు, పశువులను కరిచాయని వాపోయారు. కుక్కల బెడద నివారించాలని పంచాయతీ అధికారులను వేడుకుంటున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

విజయపురిసౌత్: విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందిన ఘటన మాచర్ల మండలం పశువేముల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దోసపాటి శ్రీహరి (65) భార్య కాంతమ్మతో కలిసి తనకున్న 5 ఎకరాల పొలంలో పనులు చేసేందుకు వెళ్లారు. భార్య పొలంలో కలుపు తీస్తుండగా శ్రీహరి పుల్లలు ఏరుతున్నాడు. అదే సమయంలో తన పొలం మీదుగా వెళ్లే 11 కేవీ విద్యుత్ లైన్ వైర్ ఇన్సులేటర్ దగ్గర తెగి శ్రీహరి మీద పడగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్ల ముందే భర్త చనిపోవటంతో కాంతమ్మ రోదిస్తున్న తీరు గ్రామస్తులను కలచివేసింది. వారికి నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యడ్లపాడులో చోరీ

యడ్లపాడు: ఇంట్లో చోరి జరిగిన ఘటనపై యడ్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యడ్లపాడు పోలీసు స్టేషన్ వెనుక ఉన్న ఇంట్లో దేరంగుల శివయ్య, దేవి దంపతులు నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం దంపతులు కూలి పనులకు వెళ్లారు. వారి కుమార్తె కళాశాలకు వెళ్లింది. వారి కుమారుడు చివరిగా ఇంటి నుంచి బయటకు వెళుతూ ఇంటి తాళం వేయడం మరిచిపోయాడు. మధ్యాహ్నం సమయంలో కుమారుడు ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంటి లోపల బీరువా పగులగొట్టి ఉంది. అందులోని సుమారు ఐదు సవర్ల బంగారు ఆభరణాలు, రూ.30వేలు నగదు కనిపించలేదు. దీంతో చోరి జరిగిందని నిర్ధారించుకుని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్, పోలీసు సిబ్బంది

టిడ్కో గృహాల క్రయవిక్రయాలు నేరం

చిలకలూరిపేట: టిడ్కో గృహాలు అమ్మినా, కొనుగోలు చేసినా నేరమని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, అర్బన్ సీఐ పి.రమేష్‌లు తెలిపారు. మున్సిపల్, పోలీసు అధికారులు టిడ్కో గృహ సముదాయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ పలువురు లబ్ధిదారులు టిడ్కో గృహాలను విక్రయిస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపారు. టిడ్కో గృహ సముదాయంలోని 300 చదరపు అడుగులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు ఎవరికీ ఇవ్వలేదని, అవి మొత్తం పురపాలక సంఘ కార్యాలయంలోనే ఉన్నాయని వెల్లడించారు. కొంతమంది వడ్డీ వ్యాపారులు గృహాల లబ్ధిదారులకు రుణాలు ఇచ్చి వాటికి బదులుగా గృహాలను స్వాధీనం చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. అనధికారికంగా జరుగుతున్న కొనుగోళ్లు, విక్రయాలు చెల్లవని హెచ్చరించారు. ఎవరైనా లబ్ధిదారులు గృహాలను అమ్మినట్లు తమ దృష్టికి వస్తే అవి స్వాధీనం చేసుకొని అర్హులైన కొత్త లబ్ధిదారులకు ఇస్తామని తెలిపారు. ఎవరికి కేటాయించిన ఇళ్లలో వారే ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ తోట వెంకటరమణ, ఏఈఈ సీహెచ్ శ్రీనివాస్, ఎస్ఐ పుల్లారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ గోవిందరావు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

రెంటచింతల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం పొంచి ఉందని ప్రతి విద్యార్థిని ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎన్ఎం షేక్ రంజాన్‌బీ అన్నారు. మంగళవారం మండలంలోని మిట్టగుడిపాడు గ్రామ సమీపంలోని కస్తూర్బా పాఠశాలలో ఆమె విద్యార్థినులతో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాల నుంచి కాపాడుకోవచ్చన్నారు. దోమ కాటు ద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధుల వ్యాపించే అవకాశం ఉందని వివరించారు. వరుసగా రెండు రోజుల పాటు జ్వరం వచ్చిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు.

టీడీపీవి హత్యారాజకీయాలు

- ఈదా సాంబిరెడ్డి పై హత్యాయత్నం దారుణం
- సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెండెం బాబురావు ధ్వజం



సత్తెనపల్లి: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన 40 రోజుల్లో రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చి హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తోందని సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, సీనియర్ న్యాయవాది పెండెం బాబురావు విమర్శించారు. మంగళవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. గుంటూరు నుంచి పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం 75 తాళ్లూరుకు వస్తున్న క్రోసూరు ఏఎంసీ మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి కారు పై కంభంపాడు– ఉంగుటూరు మధ్య టీడీపీ గూండాలు మారణాయుధాలతో పథకం ప్రకారం దాడులు చేయడం దారుణమన్నారు. ప్రజలు అధికారాన్ని కట్టబెట్టింది వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను పొట్టన పెట్టుకోవడానికి కాదన్న విషయాన్ని గ్రహించాలన్నారు. దాడులపై కేంద్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని పేర్కొన్నారు. నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి శిక్షించాలన్నారు. టీడీపీ హత్యా రాజకీయాలపై ఉద్యమిస్తామని పేర్కొన్నారు.

హెల్మెట్ రహిత ప్రయాణం ప్రమాదకరం

సత్తెనపల్లి: హెల్మెట్ ధరించని కారణంగా అధిక సంఖ్యలో ప్రజలు రోడ్డు ప్రమాదాల సమయంలో మరణిస్తున్నారని రవాణా శాఖాధికారి యు.ధర్మేంద్ర అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ చల్లా నాగ వెంకట శ్రీనివాసరావు సూచన మేరకు హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతపై పట్టణంలోని అమరావతి బస్టాప్ సెంటర్‌లో మంగళవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారి యు.ధర్మేంద్ర మాట్లాడుతూ.. ప్రమాదాలు నివారించేందుకు హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా ప్రయాణం, అధిక లోడు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్యానల్ న్యాయవాది ఆకుల నాగార్జున మాట్లాడుతూ... హెల్మెట్ ధరించి ప్రమాదాలు నివారించాలన్నారు. మోటార్ వెహికిల్ చట్టం ప్రకారం పలు నేరాల వివరాలు, వాటికి విధించే జరిమానాల గురించి వివరించారు. పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని మాట్లాడుతూ.. మైనర్‌లకు వాహనాలు ఇచ్చి ప్రమాద కారకులు కావొద్దన్నారు. మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు షేక్ ఖాజావలి, షేక్ ముబారక్, కోర్టు కానిస్టేబుల్ తుపాకుల బాజి, సలీం ఖాన్, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ మస్తాన్ రావు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవాణా శాఖాధికారి ధర్మేంద్ర

అంతర పంటలతో పలు లాభాలు

రాజుపాలెం: పత్తి పంటలో అంతరంగా గోరుచిక్కుడు, పెసర, సజ్జ, బొబ్బర్లు, చెట్టు చిక్కుడు, కంది వేయడం వల్ల ప్రధాన పంటను తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక, పిండి, నల్లి, గులాబీ రంగు పురుగుల నుంచి కాపాడుకోవచ్చని పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి తెలిపారు. మండలంలోని రెడ్డిగూడెంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. అంతర పంటల వల్ల మిత్ర పురుగుల సంఖ్య పెరుగుతుందని, దీని వల్ల చీడపీడలు ఆశించవని తెలిపారు. ద్విదళ, ఏకదళ జాతి కారణంగా భూమి సారవంతం అవుతుందని చెప్పారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానంలో అంతర పంటలు వేసుకోవడం వల్ల ఆర్థికంగా బలోపేతం అవుతారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్ఎఫ్ఎఫ్ మల్లికార్జునరావు, సైదయ్య, ప్రకృతి వ్యవసాయ రైతులు ప్రణతి, గుర్రాల మల్లికార్జునరావు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి సాగు పంటను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి

విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా వ్యవహరించాలి

నకరికల్లు: విద్యార్థుల విషయంలో అభ్యసనం, అభివృద్ధి లక్ష్యాలుగా పాఠశాలలో ఉపాధ్యాయులు పనిచేయాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎస్.లలిత సూచించారు. జాతీయ విద్యావిధానం నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చేజర్ల ఉన్నత పాఠశాలలో మంగళవారం భాషా గణితంలో పునాది అభ్యసన సంకల్ప యాత్ర నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థులందరూ పునాది అభ్యసన నైపుణ్యాలను సాధించేలా అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేలా ఉపాధ్యాయులందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. పిల్లలకు అనుభవాలతో కూడిన అభ్యసనను అందించాలని సూచించారు. వారు తమ భాషను స్వేచ్ఛగా ఉపయోగించుకునేలా, నిర్భయంగా ప్రశ్నలు అడిగేలా అవగాహన కల్పించాలన్నారు. ఆనందానికి, గౌరవానికి అత్యంత అనుకూలమైన ప్రదేశంగా పాఠశాలను తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు పఠాన్ మల్లిక, చెరుకూరి వెంకటేశ్వర్లు, గేరా మోహన్‌రావు, ఏసీహెచ్.వెంకట్రావు, బత్తుల సుందరరావు, షేక్.గౌస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చేజర్ల ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజారోగ్యంపై ఇంటింటి సర్వే నిర్వహించాలి

అచ్చంపేట: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎవరైనా సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారా? లేదా? అనే విషయమై సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి పూర్తి వివరాలతో సర్వే నిర్వహించాలని అచ్చంపేట పంచాయతీ కార్యదర్శి బి.సుబ్బారావు తెలిపారు. ఈ నెల 30వ తేదీలోపు నివేదికలు ఇవ్వాలని సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం అచ్చంపేట–1, 2 సచివాలయాల సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఇళ్ల పరిసరాలలో పారిశుద్ధ్యం తదితరాలపై వారి ఇబ్బందులు తెలుసుకుని పంచాయతీ సిబ్బంది ద్వారా పరిష్కరించాలని కోరారు. పూర్తి వివరాలతో నివేదికలు ఇవ్వాలన్నారు. ఆశా వర్కర్లు సహకరించాలని తెలిపారు. వచ్చే నెల ఒకటో తేదీన పింఛన్ల పంపిణీకి సచివాలయ సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. అప్పటివరకు సెలవులు పెట్టరాదని సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ జి.నీలపయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు

యువతి అదృశ్యంపై కేసు నమోదు

యడ్లపాడు: మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన యువతి ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు వద్ద సమాచారం కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు యువతి తల్లి ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం యువతికి వివాహం చేసేందుకు సంబంధాలు చూస్తున్నారు. దీంతో బాలిక మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. యువతి తల్లిదండ్రులు బాలిక కోసం బంధువులు, స్నేహితుల వద్ద ఆచూకీ కోసం వెతకగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై శామ్యూల్ రాజీవ్‌కుమార్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.